# పాలిటీ

## సుప్రీంకోర్టు, హైకోర్టు

భారతదేశంలో నిష్పక్షపాతమైన, స్వతంత్రమైన, ఏకీకృత న్యాయవ్యవస్థ ఉంది. దేశంలో సుప్రీంకోర్టు, రాష్ట్ర స్థాయిలో హైకోర్టు అత్యున్నతమైనవి. ఏకీకృత న్యాయవ్యవస్థ ఉండటం వల్ల దేశంలోని అన్ని కోర్టులపై పర్యవేక్షణ, నియంత్రణ అధికారాలను సుప్రీంకోర్టు కలిగి ఉంటుంది. అదేవిధంగా హైకోర్టు దిగువ కోర్టులపై పర్యవేక్షణ, నియంత్రణ అధికారాలను కలిగి ఉంటుంది. అధికారాలు, విధుల విషయ పరిధుల్లో సుప్రీంకోర్టు, హైకోర్టు కొన్ని పోలికలు, తేడాలను కలిగి ఉంటాయి.

### నిర్మాణం

రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు సుప్రీంకోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, ఏడుగురు సాధారణ న్యాయమూర్తులు ఉండేవారు. అయితే, పార్లమెంటు సాధారణ న్యాయమూర్తుల సంఖ్యను 1956లో 10కి, 1960లో 13కి, 1977లో 17కి, 1986లో 25కి, చివరగా 2009లో 30కి పెంచింది.

హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను నిర్ణయించే అధికారం కూడా పార్లమెంట్‌కే ఉంటుంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చే నాటికి 9 హైకోర్టులు ఉండగా, ప్రస్తుతం దేశంలో 24 హైకోర్టులు ఉన్నాయి. చివరగా 2013లో మణిపూర్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల్లో విడిగా హైకోర్టులు ఏర్పాటయ్యాయి. హైకోర్టు ఉన్న ఏకైక కేంద్రపాలిత ప్రాంతం దిల్లీ.

### రాజ్యాంగంలో..

రాజ్యాంగంలోని Vవ భాగం, నాలుగో ఛాప్టర్‌లో 124 నుంచి 147 వరకు ఉన్న అధికరణలు సుప్రీంకోర్టు నిర్మాణం, న్యాయమూర్తుల నియామకం, అర్హతలు, జీతభత్యాలు, పదవీకాలం, తొలగింపు, అధికారాలు, విధుల గురించి వివరిస్తాయి.

రాజ్యాంగంలోని VI వ భాగంలో 214 నుంచి 231 వరకు ఉన్న అధికరణలు హైకోర్టుల నిర్మాణం, న్యాయమూర్తుల అర్హతలు, నియామకం, తొలగింపు, అధికారాలు, విధులను వివరిస్తాయి.

124వ అధికరణ సుప్రీంకోర్టు ఏర్పాటును తెలియజేస్తుంది. అదే విధంగా 216వ అధికరణ హైకోర్టు నిర్మాణం గురించి వివరిస్తుంది.

### ప్రారంభ అధికార పరిధి

భారత సుప్రీంకోర్టు ప్రాథమిక విచారణ అధికార పరిధిలోని (131వ అధికరణ ప్రకారం) కింది అంశాలను విచారిస్తుంది.

1. కేంద్ర ప్రభుత్వం Vs రాష్ట్రం/రాష్ట్రాల మధ్య వచ్చే వివాదాలు
2. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రం/రాష్ట్రాలు Vs రాష్ట్రం/రాష్ట్రాల మధ్య వచ్చే వివాదాలు
3. రాష్ట్రం/రాష్ట్రాలు Vs రాష్ట్రం/రాష్ట్రాల మధ్య వచ్చే వివాదాలు
4. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నిక వివాదాలు
5. ప్రాథమిక హక్కులకు సంబంధించిన వివాదాలు

పైన తెలిపిన మొదటి నాలుగు సందర్భాల్లోని కేసుల్లో ప్రారంభ, అంతిమ అధికారం కేవలం సుప్రీంకోర్టుకు మాత్రమే ఉంటుంది. ప్రాథమిక హక్కులకు సంబంధించిన వివాదాలను స్వయంగా స్వీకరించి విచారించే ప్రారంభ అధికార పరిధి సుప్రీంకోర్టుతోపాటు హైకోర్టులకు కూడా ఉంటుంది.

హైకోర్టుల ప్రాథమిక అధికార పరిధి 225 అధికరణ ప్రకారం సుప్రీంకోర్టు కంటే విస్తృతమైంది.

1. ప్రజల ప్రాథమిక హక్కులకు సంబంధించిన వివాదాలు
2. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల ఎన్నికలకు సంబంధించిన వివాదాలు

3. వివాహం, విడాకులు, కంపెనీ చట్టాలు, కాపీరైట్ చట్టాలు, నౌకాదళం, మరణ శాసనం లాంటి అంశాలకు సంబంధించిన వివాదాలు
4. రాజ్యాంగ అంశాలను వ్యాఖ్యానించాల్సిన అవసరం ఉన్న విషయాలు
5. ఎక్కువ విలువ, చట్టాన్ని వ్యాఖ్యానించాల్సిన అవసరం ఉన్న సివిల్ వివాదాలు లాంటి అంశాల్లో హైకోర్టుకు ప్రారంభ అధికార పరిధి ఉంటుంది.

## సలహా విషయంలో

దీన్ని భారత ప్రభుత్వ చట్టం - 1935 నుంచి స్వీకరించారు. రాజ్యాంగంలోని 143వ అధికరణ ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరవచ్చు. రెండు రకాల సందర్భాల్లో రాష్ట్రపతి సలహా కోరడం, సుప్రీంకోర్టు సలహా ఇవ్వడం జరుగుతుంది.

1. ఒక శాసనం లేదా ప్రజాప్రాముఖ్యం కలిగిఉన్న విషయంపై మరింత లోతైన వాస్తవాలను తెలుసుకోవడానికి సలహా కోరవచ్చు.
2. రాజ్యాంగం అమల్లోకి రాకముందు ప్రభుత్వాలు కుదుర్చుకున్న ఒప్పందాలకు సంబంధించి ఏర్పడిన వివాదాలపై సలహా కోరవచ్చు.

ఇందులో మొదటి అంశంపై రాష్ట్రపతి సలహా కోరినప్పటికీ, సుప్రీంకోర్టు సలహా ఇవ్వొచ్చు లేదా నిరాకరించవచ్చు. కానీ పైన తెలిపిన రెండో సందర్భంలో మాత్రం రాష్ట్రపతి కోరితే సుప్రీంకోర్టు తప్పక సలహా ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇది న్యాయ నిర్ణయం కాదు, కేవలం సలహా మాత్రమే కాబట్టి సుప్రీంకోర్టు సలహాను పాటించడం, పాటించకపోవడం రాష్ట్రపతి విచక్షణపై ఆధారపడి ఉంటుంది.

## కోర్ట్ ఆఫ్ రికార్డ్

రాజ్యాంగంలోని 129వ అధికరణ ప్రకారం సుప్రీంకోర్టు ఇచ్చిన ప్రొసీడింగ్స్, తీర్పులను దేశంలోని అన్ని న్యాయస్థానాలు ప్రామాణికమైన ఆధారాలుగా స్వీకరించాల్సి ఉంటుంది. వీటినే అనుపూర్వికాలు (Precedents) అంటారు.

రాజ్యాంగంలోని 215వ అధికరణ ప్రకారం హైకోర్టు కూడా కోర్ట్ ఆఫ్ రికార్డ్‌గా వ్యవహరిస్తుంది. రాష్ట్రంలోని దిగువ న్యాయస్థానాలన్నీ హైకోర్టు తీర్పులను, ప్రొసీడింగ్స్‌ను ప్రామాణికమైన ఆధారాలుగా స్వీకరించాల్సి ఉంటుంది.

రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు 'కోర్టు ధిక్కారం' అనే పదం రాజ్యాంగంలో ఎక్కడా లేదు, అయితే 'కోర్టు ధిక్కార చట్టం 1971' ద్వారా నిర్వచించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను గౌరవించాలి, పాటించాలి. దాని ప్రకారం కోర్టు ధిక్కారం నేరం, దానికి జరిమానా లేదా శిక్ష లేదా రెండూ ఉంటాయి.

## రిట్ అధికార పరిధి

ప్రాథమిక హక్కులను కాపాడటానికి రిట్స్ (హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, సెర్షియోరరీ, కో వారెంటో) జారీ చేసే అధికారం రాజ్యాంగంలోని 32వ అధికరణ ప్రకారం సుప్రీంకోర్టుకు, 226వ అధికరణ ప్రకారం హైకోర్టులకు ఉన్నాయి. అయితే సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కుల విషయంలో మాత్రమే 'రిట్స్' జారీ చేయగలదు. హైకోర్టు తన న్యాయ అధికార పరిధిలో (భూభాగంలో) ప్రాథమిక హక్కులతోపాటు ఇతర విషయాలకు సంబంధించి కూడా రిట్స్ జారీచేయగలదు. అంటే రిట్స్ విషయంలో హైకోర్టు విషయపరిధి, సుప్రీంకోర్టు విషయపరిధి కంటే విస్తృతమైంది.

## న్యాయ సమీక్షాధికారం

రాజ్యాంగంలో 'న్యాయ సమీక్షాధికారం' అనే పదం ఎక్కడా వాడనప్పటికీ రాజ్యాంగంలోని 13వ అధికరణ ప్రకారం ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా చేసే చట్టాలు లేదా ప్రభుత్వ ఆదేశాలు చెల్లవు. పార్లమెంట్ లేదా రాష్ట్ర శాసనసభ చట్టాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే వాటిని సుప్రీంకోర్టు రద్దు చేయగలదు. ఉదాహరణకు 99వ రాజ్యాంగ సవరణ చట్టం, 2014 ద్వారా ఏర్పాటు చేసిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ను 2015లో సుప్రీంకోర్టు రద్దుచేసింది.

రాజ్యాంగ ఔన్నత్యాన్ని, సమాఖ్య వ్యవస్థను, ప్రాథమిక హక్కులను కాపాడటం మొదలైన సందర్భాల్లో సుప్రీంకోర్టు న్యాయ సమీక్షాధికారాన్ని వినియోగించగలదు. హైకోర్టు కూడా 226వ అధికరణ ప్రకారం ప్రాథమిక హక్కులకు, రాజ్యాంగానికి విరుద్ధమైన శాసనాలు లేదా ప్రభుత్వ ఉత్తర్వులను రద్దుచేసే అధికారం కలిగి ఉంటుంది. హైకోర్టు రాష్ట్రపరిధిలో ఉన్నప్పటికీ, కేంద్రప్రభుత్వ

శాసనాలను, ఉత్తర్వులను న్యాయసమీక్ష చేయగలదు. (42వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976 ద్వారా కేంద్ర ప్రభుత్వ శాసనాలను న్యాయ సమీక్ష చేసే అధికారాన్ని హైకోర్టులకు రద్దు చేసినప్పటికీ 43వ రాజ్యాంగ సవరణ చట్టం, 1977 ద్వారా పునరుద్దరించారు.)

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులు ఖాళీగా ఉన్నప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాష్ట్రపతిగా వ్యవహరిస్తారు. రాజ్యాంగంలోని 147వ నిబంధన ప్రకారం సుప్రీంకోర్టు రాజ్యాంగ అంతిమ వ్యాఖ్యాత. 137వ నిబంధన ప్రకారం సుప్రీంకోర్టు తన తీర్పులను తానే పునర్విచారణ (మార్చుకోగలదు) చేయగలదు. సుప్రీంకోర్టు కాలగమనంలో న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన విషయంలోనూ, పార్లమెంటుకు ఉన్న రాజ్యాంగ సవరణాధికారం విషయంలోనూ తన తీర్పులను తానే సవరించింది. ప్రజాప్రయోజన వ్యాజ్యం, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, E కోర్టులు లాంటి కొత్త పద్ధతులను ప్రవేశపెట్టింది.

## అప్పీళ్ల విచారణాధికారం

దేశంలో అత్యున్నత అప్పీళ్ల న్యాయస్థానం సుప్రీంకోర్టు. బ్రిటిష్ పాలనాకాలంలో ఫెడరల్ కోర్టు పైన బ్రిటిష్ ప్రీవీకౌన్సిల్‌కు అప్పీళ్ల విచారణాధికారం ఉండేది. సుప్రీంకోర్టు పరిధిలోకి వచ్చే అప్పీళ్లు 4 రకాలు. అవి:

1. **రాజ్యాంగ సంబంధ అప్పీల్:** రాజ్యాంగంలోని 132వ అధికరణ ప్రకారం రాజ్యాంగపరమైన అంశం ఇమిడి ఉన్న విషయాలపై హైకోర్టు తీర్పుతో సంతృప్తి చెందకపోతే సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసుకోవచ్చు. అయితే, రాజ్యాంగ విశ్లేషణకు సంబంధించిన లోతైన అంశం ఉందని భావించి హైకోర్టు ధ్రువీకరించాల్సి ఉంటుంది.

2. **సివిల్ అప్పీల్:** రాజ్యాంగంలోని 133వ అధికరణ ప్రకారం హైకోర్టులు ధ్రువీకరించిన రెండు రకాల అంశాలను సివిల్ అప్పీల్‌గా సుప్రీంకోర్టు స్వీకరిస్తుంది.

   i) అత్యంత ప్రాధాన్యం ఉన్న న్యాయపరమైన అంశాలు ఉన్నాయని హైకోర్టు ధ్రువీకరించినప్పుడు

   ii) చట్టానికి సంబంధించి లోతైన ప్రశ్నను సుప్రీంకోర్టు మాత్రమే నిర్ణయించాల్సి ఉంటుందని ధ్రువీకరించినప్పుడు

3. **క్రిమినల్ అప్పీల్:** రాజ్యాంగంలోని 134వ అధికరణ ప్రకారం క్రిమినల్ అప్పీళ్లను రెండు రకాల సందర్భాల్లో స్వీకరిస్తుంది.

   i) కింది న్యాయస్థానం నిర్దోషిగా ప్రకటించిన తర్వాత హైకోర్టు ఆ తీర్పును రద్దుచేసి యావజ్జీవ కారాగార శిక్ష లేదా మరణశిక్ష విధించినప్పుడు

   ii) కింది కోర్టు (జిల్లా సెషన్స్ కోర్టు) విధించిన మరణ శిక్షను పునఃసమీక్షించి హైకోర్టు ఆ శిక్షను రద్దుచేస్తే సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసుకోవచ్చు.

4. **స్పెషల్ లీవ్ పిటిషన్ ద్వారా అప్పీల్:** రాజ్యాంగంలోని 136 (1) అధికరణ ప్రకారం హైకోర్టు లేదా ట్రైబ్యునల్ లేదా కింది కోర్టుల తీర్పులపై అప్పీల్ చేసుకోవడానికి సుప్రీంకోర్టు ప్రత్యేక అనుమతి ఇవ్వొచ్చు. కేవలం హైకోర్టు తీర్పుపైగాక ఏ స్థాయిలోని కోర్టు అయినప్పటికీ అప్పీల్ చేసుకోవచ్చు. అయితే అప్పీలును స్వీకరించడం లేదా స్వీకరించకపోవడం సుప్రీంకోర్టు విచక్షణపై ఆధారపడి ఉంటుంది. 136 (2) ప్రకారం సైనిక కోర్టులు/ట్రైబ్యునల్ తీర్పులపై సుప్రీంకోర్టుకు స్పెషల్ లీవ్ పిటిషన్ ద్వారా అప్పీల్ చేయడానికి అవకాశం లేదు.

రాష్ట్రంలో సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి హైకోర్టు అత్యున్నత అప్పీల్ కోర్టు. జిల్లా సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్ష అమలు కావాలంటే హైకోర్టు అనుమతి తప్పనిసరి.

**రచయిత: ముప్పాల భాస్కరరాజు**

www.eenadupratibha.net